రాజునకు విత్తముపార్జించు యంత్రాలుగా ఉపయోగింపబడుతున్నారు గ్రామస్థులు. అక్కడ మగవారి ప్రాణాలూ ఆడవారి మానాలూ గడ్డిపరకపాటు...

# 'రాజుని నేను పేలుస్తా .... ఇలా'

● డి. వి. ఎన్. శాస్త్రి ●

వేణు పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయించేడు. ఎంతో గారాబంగా ఎంతో అభిమానంగా పెంచి తాను కష్టపడైనా చదువు చెప్పించి, ఒక ఇంటివాణ్ణిగా చేసిన విశ్వనాథంతో విడిపోయి వేరే సంసారం పెట్టేడు సూర్యం, వివాహం అయిన కొద్దినెలల్లోనే. వేణుకి విశ్వనాథం పెద్దన్న. సూర్యం చిన్నన్న అవుతారు. ఇంతకుముందు స్నేహితుల ఇళ్ళల్లో ఇలా జరిగాయని విన్నా అట్టే పాటించలేదు వేణు. కాని తనఇంట్లోనే జరిగేసరికి కళ్ళు తెరిచేడు. అదే కారణం అవివాహితునిగా ఉండ నిశ్చయించడానికి. ఎవరో నూతన స్త్రీ తన హృదయాన్ని, అన్నహృదయాన్ని అతికిన ప్రేమని కరిగించి వాటిమధ్య అంతరం కల్పించడం అతని కొంతమాత్రం ఇష్టంలేదు.

భర్తయైన విశ్వనాథాని కిష్టంలేని మాట అని అతని మనస్సు నొప్పించడం అలవాటులేదు సావిత్రికి. కాని ఈ మారు మనస్సు పట్టలేకపోయింది ఒకనాడతనితో అంది:

"మీరిన్ని ఇక్కట్టులూ పడి పెద్దవాణ్ణిచేస్తే మీ తమ్ముడు సూర్యం ఏంచేసేడో చూసేరా? మీకేమిటి లాభం వచ్చింది మా తమ్ముళ్ళగురించి. ఇంత డబ్బు ఖర్చుపెట్టి ఇన్నికష్టాలు పడడంలో? మీకుకూడా ఇద్దరు పిల్లలున్నారని మరచిపోకండి" అని.

విశ్వనాథం మనస్సు చివుక్కుమంది. కొంతతడ వూరకొన్నాడు, గంభీరభావంతో.

"నిన్ను, నీ పిల్లల్ని అన్యాయం చేస్తున్నానంటావా?" అని ప్రశ్నించాడు. మరుక్షణమే భార్యను నొప్పించాడని తెలుసుకొని మృదువుగా, జాలిగా అన్నాడు:

"పిచ్చిదానా! ఈ పసికుంకలు ఏనాడో పోషిస్తారని, కుటుంబాన్ని ఉద్ధరిస్తారని కాదు. నా విధి నేను తీరుస్తున్నా. జీవితవిధి తీర్చకపోవడం ఉత్కృష్టమైన మానవత్వాన్ని అధమగతికి పాలుచేయడం కాదూ?"

కొంతసేపు మౌనం దాల్చాడు, ఆలోచనా చిహ్నంగా, తర్వాత మెల్లగా అన్నాడు:

"సావిత్రీ! నీతో ఇన్నాళ్లు చెప్పలేదు. కాని నీలో దాచి ఉంచిన నీ ఊహ బయల్పర్చేవు. కాబట్టి నేను చెప్పక తప్పదు. మా తండ్రి చనిపోయినప్పుడు నువ్వు మా పుట్టింటిలో ఉన్నావు. జ్ఞాపకం ఉందీ?'

"ఆఁ" అంది సావిత్రి.

"తల్లిలేని పిల్లల్ని మిక్కిలి ముద్దుతో పెంచిన మా తండ్రి మరణాసన్న సమయంలో అతికష్టం మీద దీనంగా, విషాదరేఖలు పొడసూపే వదనంతో అన్నాడు 'విశ్వూ! ఈ ఇద్దరిని నీ చేతుల్లో వదులుతున్నాను. ఈ కాలం వాళ్ళలా కాకుండా, వాళ్లు వాళ్ళ కాళ్ళమీద నిలబడేవరకు పెంచుతానని మాట ఇయ్యి. అంతవరకు నా ప్రాణం పోయిగా పోదు' నన్ను కన్నతండ్రి ఈపాటి కోరిక నన్ను కోర్తే, అదైనా చనిపోతూ, ఒప్పుకోకపోవడంకన్న నీచత్వం ఉందీ? నేను మా తండ్రిచేతిలో చేయి వేసేసరికి, అతని ముఖం విప్పారింది మేఘాలు దాటివచ్చిన సంధ్యాకాలపు సూర్యుడిలాగ" అని చెప్పి, కంటివెంట నీరు తెచ్చుకొన్నాడు, విశ్వనాథం.

— 2 —

ఒకనాడు భోజనాల సమయంలో, విశ్వనాథం వేణుతో అన్నాడు:

"అయితే- రెండునెల్లో వేణూ బి.ఏ అన్నమాట"

"ఆఁ, ప్యాసు అయితే" వేణు జవాబిచ్చేడు, మందహాసంగా.

"అంతా బాగుంది. కాని బత్తిగా బి. ఏ. ప్యాసయినవాడిలా కనుపించవేమిరా, నువ్వు. మా రాజు కొడుకు చూడు, ఇంటర్మీడియేటు చదువుతున్నాడో లేదో కాని, వైఖరి! అతని

సూట్లు, అలాని నడక, ఎవరితో పడితే వారితో ఇంగ్లీషులోనే మాట్లాడ్డం!!" అన్నాడు విశ్వనాథం.

"అతడు రాజు కొడుకు, నేను కానే" వేణు ప్రత్యుత్తరం ఇచ్చి ఊరుకొని, మరల అన్నాడు:

"హిందూదేశంనుండి ఇంగ్లీషు నిర్మూలం అవుతున్న రోజులివి. అలాంటప్పుడు మీ రాజు కొడుకు ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నాడంటే శరీరం క్రొత్తయుగంలోకి తెచ్చుకొన్నా, మనస్సు పాతయుగంలోనే ఉంచేడు అన్నమాట— వెనక్కి తిరిగి, ముందుకు నడచినవాడిమాదిరి. ఇంక అతని సూట్లు అంటావా! పదిమంది బట్టలు దొంగలాడి తానే కట్టుకొంటున్నాడన్నమాట."

ఆశ్చర్యంగా అడిగేడు విశ్వనాథం:

"రాజు కొడుకు దొంగంటావేమిట్రా? నీకేం మతిపోయిందా ఏం?"

"దొంగతనం కాక మరేమిటి? ఇతడు వెచ్చించిన డబ్బుతో, ఇతని సూట్లకయిన బట్టతో పదిమంది షుమారు నగ్నంగా తిరుగుతూన్న బీదల్ని చలిబాధనుండి కాపాడవచ్చుగా!!"

"అతని డబ్బు అతడు ఖర్చుపెట్టుకొంటున్నాడు; మరొకరి డబ్బు తీసుకోలేదుగా?"

"అతని డబ్బు! ఆ డబ్బు ఎక్కడనుండి వచ్చింది? కష్టపడ్తున్నాడనా? ఏదైనా న్యాయవృత్తిలో ఆర్జిస్తున్నాడనా? తిండి తిప్పలు సరిగా లేక, జీవిత సౌఖ్యాలంటే తెలీక, బలము లేమి అన్నివిధమూలైన రోగాలకు గురియైన పేద రైతులు పండించేదానిలో రెండువంతులు లాగుకొని వారి సదుపాయాలైనా చూడని దౌర్జన్యపుముఠా ఈ రాజపుంగవులు! అది వారి డబ్బెలా అయింది? తప్ప త్రాగుతూ, వేశ్యల వెంబడి తిరుగుతూ, గుఱ్ఱపు పందాలే జీవితలక్ష్యంగా తీసుకొంటూ కాలం గడుపుతున్నారనా?" అని ఆవేశపూరితంగా ప్రశ్నించేడు వేణు.

విశ్వనాథానికి వేణు మాటలు అగమ్యగోచరంగా ఉన్నాయి. 20 సంవత్సరాలుగా రాజపోషణలో ఉండి పై ప్రపంచంలో చెలరేగుతున్న విప్లవ తుపాన్ల బారినుండి దూరంగా బ్రతుకుతూ తాను నివసిస్తున్న సాంఘిక కట్టడం, కాలం నడుస్తున్నకొద్దీ బలాన్ని పోగొట్టుకుంటూన్న కట్టడం, తుపాను రాకపోవాలి కాని, వస్తే నేల మట్టం కాగలదని ప్రాతయుగానికి చెందిన హేతువువల్ల తెలుసుకోలేని విశ్వనాథానికి వేణుమాటలు ఆశ్చర్యం కలుగజేసేయి. కాలేజీలో ఉన్నప్పుడే ఆధునిక తత్త్వవిజ్ఞానుల రచనలు పఠనముచేసి జ్ఞానపిపాసను పోగొట్టుకొన యత్నించిన వేణు, రాజకీయాలు అతిశ్రద్ధతో, మిక్కిలి జిజ్ఞాసతో అభ్యసిస్తున్న వేణు, వారి గ్రామానికి రాగానే సాధారణ భారతీయుని నిత్యజీవితానికి చెందిన సమస్యలకి ముఖాముఖి కాగానే గ్రామస్థుల అవస్థని ఔన్నత్యంలోనికి తీసుకొనిరా సంసిద్ధుడయాడని విశ్వనాథానికి తెలియదు. వేణు అమాయకుడనే అభిప్రాయంతో ఉన్నాడతడు.

౩

బ్రిటిషువారు పరిపాలిస్తున్నప్పుడు కూడ వారి ప్రభుత్వంక్రింది గ్రామాలకన్న రాజుల హయాంలో ఉన్న గ్రామాలు అధోగతిలో ఉండేవి. మానవులుగా పరిగణింపబడని ఆ గ్రామస్థులు రాజులకు విత్తముపార్జించుటకు యంత్రాలుగా ఉపయోగింపబడ్తున్నారు. ప్రాత యంత్రానికి, అవుసరానికి పనికిరాని గ్రామస్థునికి ఒకే విలువ. మగవారి ప్రాణాలు, ఆడువారి మానాలు గడ్డి పరకలతు.

వేణు కార్యరంగంలో దిగాక గ్రామ సౌభాగ్యప్రాప్తికి గ్రామస్థులే గట్టి అడ్డు అని తెలుసుకున్నాడు. శతాబ్దాల తరబడి మూఢ నమ్మకాల చేత, మూఢాచారాలచేత క్రుంగబడి, దాసత్వానికి అలవాటుబడ్డ ఆ గ్రామస్థులు ఐకమత్యజనిత ఉత్కృష్టశక్తిని తెలుసుకోలేకపోయారు. అందుచేత అతడు కార్యసాఫల్యానికి ముఖ్యమైన మానసిక సత్త్వాన్ని వారిలో సృష్టింప పూనుకున్నాడు.

౪

ఒకనాడు వేణు చాల తొందరగా వీధిలోకి వెళ్తున్నాడు. విశ్వనాథం కోటపని చూసుకొని ఇంటికి వచ్చేసమయం. వేణుని చూసి అడిగాడు:

"అబ్బాయీ! వేణూ! ఎక్కడికి బయలుదేరేవు?"

"చిన్న పని ఉంది."

"పెలతలలో ఉన్నవాడివి, నీకే గ్రామంలో పనేమిటి?"

"......"

"ఈ సాయంత్రమే మన చిన్నాన్నగారి గ్రామం వెళ్ళు, నీ భవిష్యత్తుగురించి ఏదో సలహా ఇస్తాను రమ్మని ఉత్తరం వ్రాసేడు."

"ఈ సాయంత్రమా?" అని ప్రశ్నించి, కొంత తడ వూరకుండి, తిరుగ అన్నాడు:

"ఈ రోజు వీలులేదు. నాకు పని ఉంది. ఎప్పుడు వెళ్ళేది తర్వాత చెప్తాను" అని చెప్పి వెళ్ళబోతున్నాడు.

...ఆగు-నీ పనేదో నాకు తెలుసు. మా మంత్రిగారు ఇవాళ నన్ను పిలిపించి చీవాట్లు పెట్టేడు. ఇక్కడెప్పుడూ లేని అలజడి కలుగజేస్తున్నావట రాజుగారికి వ్యతిరేకంగా గ్రామస్థులకి ప్రబోధిస్తున్నావట. దివాణానికి దానివల్ల నష్టం కలుగుతోందట. ఏమంటావు?" అడిగాడు విశ్వనాథం.

వేణు మాట్లాడలేదు.

"ఇవన్నీ నీకెవరు నేర్పేరురా? బి.ఏ. ప్యాసు అవుతావు కడుపులో చల్ల కదలకుండా ఏదో పని చేసికొని హాయిగా బ్రతకొచ్చుందాము. కానీ, బయల్దేరు, చిన్నాన్నగారింటికి."

వేణుకిది ఒక పెద్ద పరీక్షాసమయంలా ఉంది. అన్నమాట జవదాటని వేణు గట్టి ఆలోచనలో పడ్డాడు.

"ఏం? ఊరుకున్నావు" అని విశ్వనాథం అడిగేసరికి ఒక నిశ్చయానికి వచ్చేడు. అతి కష్టం మీద అన్నాడు:

"ఇక్కడొక ముఖ్యమైన పని ఉంది. అది పూర్తికానిదే నేనిక్కడనుండి కదలలేను."

తలమీద పిడుగుపడ్డట్టు అయింది విశ్వనాథానికి. ఎప్పుడూ మాటకు వ్యతిరేకంగా నడవని వేణు అలా జవాబు చెప్పేసరికి కోపం పట్టలేక అన్నాడు:

"నువ్వు వెళ్ళక తప్పదు. వెంటనే బయల్దేరు" మెల్లగా, గౌరవం పోడమా పేట్లు వేణు అన్నాడు:

"క్షమించాలి. నా స్వంత పని అయితే తప్పక మాని నీ మాట మన్నించేవాణ్ణి. కాని ఇప్పుడు నా చేతుల్లో ఏమీ లేదు. నేనొక సంస్థకి చెందినవాణ్ణి. సంస్థకి వ్యతిరేకంగా వెళ్ళటానికి నాకు హక్కులేదు" అని చెప్పి, చకచకగా వీధిలోకి వెళ్ళిపోయాడు.

# ఆనందవాణి పోస్టుబాక్సు నెంబరు 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు

తండ్రికిచ్చిన వచనం ఒక వైపు భార్య అన్న మాటలు రాజుగారికి కోపం తెప్పిస్తుందన్న భయం ఒకవైపు అయి ఘోర యుద్ధం సాగిస్తున్నాయి విశ్వనాథ మనస్సులో. ఆవిధ భావాలు తుపానులోని సముద్రంలా అల్లకల్లోలంగా ఉన్నాయి.

వేణు ఆ సాయంత్రం బహిరంగ సభలో ఉపన్యసించేడు, ఉత్తేజంతో, ఉద్వేగంతో, ఆవేశంతో. రైతుల హక్కులకోసం వేణు నాయకత్వంతో ఆందోళన కల్గించటానికి నిశ్చయమైంది.

*

వేణూ! నా మాట విను. నువ్వు పూనుకొన్న కార్యం నీకు మేలు చేయదు, కీడే కాని. శక్తివంతమైన రాజుని ఢీకొంటున్నావు" అన్నాడు విశ్వనాథం, భ్రాతృప్రేమాతిశయంతో.

"నేను నా స్వీయ శ్రేయస్సు ఎప్పుడూ కోరలేదు. ప్రజల ప్రచండశక్తిముందర ధనంవల్ల తెచ్చుకొన్న రాజు శక్తి ఏపాటిలా? ఇది నాచరికం అంతరించవలసిన యుగం. అంచేత అన్నయ్యా, నా మీద నీకు నిజంగా అభిమానమే ఉంటే నా పనికి అడ్డు తగలకు," దృఢనిశ్చయ స్ఫురితవాక్కుతో అన్నాడు వేణు.




కేసరికుటీరం, లిమిటెడ్.,

మద్రాసు, 14.

ఒరిస్సా, నైజాము డొమినియన్లు, ఆంధ్రజిల్లాలు,

తమిళనాడులకు ఏజెంట్లు —

సీతారామా జనరల్ స్టోర్సు.

బరంపురం-సికంద్రాబాదు-బెజవాడ-మధుర.


—"ఇన్ని సంవత్సరాలు నా ఆదరాభిమానాలలో పెరిగావు, నీ అన్నను. నామీద నీకు కించిత్తైనా అభిమానం ఉందీ? వేణూ, రాజుగారు నాకేమని ఆజ్ఞ ఇచ్చేరో తెలుసునా? నిన్ను కార్యంనుండి మరలించకపోతే, నన్ను ఉద్యోగంనుండి తొలగిస్తారట. ఒక్కమారు ఆలోచించు వేణూ. నేను ఆర్జించేదేమిటి కనుక? ఆర్జించేదో నూరాణ్యనికీ నీకూ చదువులు చెప్పించడంతో ఖర్చయింది. ఈ వయస్సులో, నాకు మరెవ్వరు ఉద్యోగం ఇస్తారు? పెళ్ళాం, ఇద్దరు పిల్లలు, వాళ్ళని ఎలా పోషిస్తాను? వేణూ!..." మరి చెప్పలేకపోయాడు. గొంతుకలో ఏదో అడ్డగించినట్టుయింది.

వేణుకి ఒక క్షణం తన రాతిగుండె కరుగుతూన్నట్టనిపించింది, విశ్వనాథం మాటలవల్ల. తన అన్న అన్నదానిలో సత్యం లేకపోలేదు అని అనిపించింది. కాని వెంటనే జాలి దుర్బలం అని తలచేడు. బహుసంఖ్యాకుల శ్రేయస్సు స్వల్ప సంఖ్యాకుల కష్టకారణమైనా విచారించకూడదని చింతించేడు.

"అన్నయ్యా, నేను వెనక్కి మరలిరాలేను. కాని, నీ ఉద్యోగానికి, నీకు హాని కలుగనీయకుండా నీ జీవితంనుండి తొలగిపోతాను. మీ రాజుగారితో చెప్పు, నన్ను నువ్వు ఇంటినుండి తరిమివేసినట్టు, నేను చనిపోయినట్టు లెక్కవేసినట్టు" అని చెప్పేసి, బయటికి శీఘ్రంగా వెళ్ళిపోయాడు.

"వేణూ! వేణూ!!..." విశ్వనాథం ఎంత పిల్చినా తిరుగ రాలేదు.

మతిపోయినవాడిలా వీధి వరండామీద చతికిల బడిపోయాడు విశ్వనాథం.

... ... ...

కొన్ని నెలలతర్వాత—

"నాన్నా! చిన్నాన్నేడీ?" అని ప్రశ్నించింది విశ్వనాథం పదేళ్ళ కుమార్తె.

విశ్వనాథం కంటివెంట నీటి బిందువు రాలింది. అన్నాడు

"చిన్నాన్నని రాజు గుండు పేల్చి చంపించేసేడమ్మా." విశ్వనాథం ఏడేళ్ళ కుమారుడన్నాడు:

"రాజు మంచివాడు కాదు. కదండీ నాన్నారూ, రాజుని నేను పేల్చేస్తా—ఇలా" అని ఒక కర్రని తుపాకీలాగ పట్టి అభినయించేడు.